# దూరాభారం

పెనుమాక నాగేశ్వరరావు



‘‘నేనూ వస్తారా. రాగల్ను. నాకూ చూడాలని వుంది పాపం’’గాద్గికంగా అన్నది అమ్మ.

‘‘నువ్వా... అంత దూరం ప్రయాణం చేయలేవమ్మా. పైగా సాయంత్రమే మళ్లీ తిరుగు ప్రయాణం... చాలా హైరానా పడతావ్. అంత సేపు కూర్చోవటం అంటే కష్టం కదమ్మా. ఇంతా చేస్తే మనం అక్కడ వుండేది రెండు గంటలే’’అనునయంగా అన్నానేగానీ నాకూ అసంతృప్తిగానే వున్నది. అమ్మని రావద్దనడం. ఆమె ఇష్టాన్ని కాదనలేకపోతున్నాను. అలాగే ఆమెను కష్టపెట్టటానికీ మనసు ఒప్పటం లేదు.

## కథ



మా మేన మామ భార్య చనిపోయినట్లు అర్ధరాత్రి ఒంటి గంటకు ఫోను ద్వారా తెలిసింది. ఇంట్లో పిల్లలు, పెద్దలు అందరూ నిద్ర లేచారు. తెల్లవారి ప్రయాణం గురించిన చర్చలో భాగంగా అమ్మకు నాకు ఆ విధంగా సంభాషణ జరుగుతుండగానే.

''నువ్వు వెళ్లలేవులే అత్తయ్యా. ఆయన్ని ఒక్కర్నే వెళ్లి రానీ. అంత దూరం ప్రయాణం చేయలేవు నువ్వు''నాభార్య నాకే వత్తాసు పలికింది.

''అవును బామ్మా... నాన్నని వెళ్లిరానీ నువ్వు వెళ్లద్దు. సీట్లు వుంటయా? వుండవు. రానూ పోనూ పదిహేను గంటలు ప్రయాణం, రిజర్వేషన్ను కాకుండా, బస్సులోనో, రైల్లోనో తెలియకుండా వెళ్లాలంటే... నువ్వు చాలా ఇబ్బంది పడ్తావ్'' నా కూతురి సలహా.

''అంతేలే బామ్మా .. నాన్న చాల్లే''నా కుమారుడి ఆకతాయి తనపు అవాకు. అందరి మాటలూ ఆలకిస్తున్న నా మనసులో అత్తయ్య రూపు రేఖలు, హావ భావాలు, ఆమె మాట తీరు, నడక తీరు, వగైరాలన్నీ మనసు పొరల్లోంచి ఒకదాని వెంట ఒకటి తరుముకొస్తున్నట్లుగా బయటకు వస్తున్నాయ్. బహుశా అమ్మ పరిస్థితి అలాగే వుండి వుంటుంది. మౌనంగా కూర్చున్న ఆమె మస్తిష్కంలో ఎన్నెన్ని జ్ఞాపకాలో మరి!

చనిపోయిన మనిషి అమ్మకు ఏమవుతుంది? అన్న భార్య అరవై అయిదు సంవత్సరాల అనుబంధం, ఆత్మీయత, స్నేహం, సుదీర్ఘ ప్రయాణం. ఎన్ని వేడుకలు, ఎన్ని విషాదాలు, ఎన్ని ఛలోక్తులు, మరెన్ని ఊరడింపులు! చిన్నతనంలో ఒకరి పట్టుచీరలు ఒకరు మార్చుకుని కట్టుకున్న సందర్భాలు, ఒకరి కోసం ఒకరు పూల మాలలు దాచిపెట్టి అందించనున్న మధుర ఘట్టాలు, కలసి వడ్డించిన పంక్తి భోజనాలు, పెళ్లిళ్లు, పేరంటాలు, సమస్త బంతులు, అట్ల తద్దిలు, గోరంటాకులు, వయసచ్చాక కలసి వెళ్లిన ఆలయాలు, కలసి చేసిన కార్తీక స్నానాలు, కలసి చదివిన సహస్ర నామ పారాయణలు, భజనలు, పాటలు, మామయ్య చనిపోయినప్పుడు అత్తయ్యను ఓదార్చిన అమ్మ, నాన్న మరణించినప్పుడు అమ్మను అక్కున చేర్చుకుని ఊరడించన అత్తయ్య, కలసి పంచుకున్న సుఖదుఃఖాలు, కలిమి లేములు, మనసెరిగి మసలుకున్న వారి ఆత్మీయత, అనురాగం వీటిల్లో కొన్ని విన్నవాడిని, కొన్ని చూసిన వాడ్ని కావటం వల్ల అన్నీ తెలిసిన వాడ్ని. ఆ యిద్దరి స్నేహం అర్థం చేసుకోగలిగిన వాడ్ని నేను.

''పోనీ ఓ పని చేయండి. రేపు మీరు ఒక్కరు వెళ్లిరండి. పదవ రోజుకో, పన్నెండవ రోజుకో అత్తయ్యను కూడా తీసుకుని వెళ్లి రావటానికి రేపే రిజర్వేషన్ చేయించండి''అన్నది శ్రీమతి. ''పదవ రోజో, పన్నెండో రోజో నేనెందుకే వెళ్లటం, నేనేం ధర్మోదకాలు వదలాలా, తిలోదకాలివ్వాలా? ఇప్పుడు

వెళ్తే ఆఖరిసారిగా ఆమెను చూడచ్చని కదా'' అంత కన్నా మాట్లాడలేకపోయింది అమ్మ.

అంతలోనే ఫోను మోగింది. మా అందరి మాటలు ఆగిపోయినై. ఫోను చేసింది నాకు ఆఖరి మేనమామ. చనిపోయిన వ్యక్తికి మరిది. మా అమ్మకు తమ్ముడు. ఈ వయసులో అంత దూరం ప్రయాణం చేయలేననీ, రావాలనే వున్నా శరీరం సహకరించటం లేదనీ, ఎవర్నీ ఏమీ అనుకోవద్దని చెప్పమని ఫోనులో ఆయన చెప్పిన మాటలు.

''ఎదుటి వారిని సంతోష పరచటానికో, సంతృప్తి పరచటానికో ఏదో చేసే మనిషిని కాను. ఎవరి సంతోషం వారిదనుకునేవాణ్ని. నేనేం చేసినా నా సంతోషంకోసమే''వయసులో వుండగానూ, వుడిగాకనూ ఆయన మాటల ధోరణి గుర్తుకు వచ్చి నొచ్చుకున్నాను, విరక్తిగా నవ్వుకున్నాను. ప్రేమ రాహిత్యం, ప్రేమను వ్యక్త పరచలేక పోవటం ఈ రెండింటిని భరించడం బహుకష్టం. ఆది నుంచి ఇప్పటి వరకూ ఆ రెండింటితోనే జీవితం లాక్కువస్తున్న ఆయనకూ నాకూ ఎప్పుడూ పేచినే.

''ఎవర్రా ఫోను''అడిగింది అమ్మ.

చెప్పను.

''తెల్లవారబోతున్నది. తయారుకండి మరి, నీళ్ల పొయ్యి మీద పెట్ట మంటారా'' పురమాయింపుగా అన్నది శ్రీమతి. అలాగేనన్నట్లు తలాడించాను.

''అమ్మా... నువ్వు కూడా బయల్దేరు... తీసుకు వెళ్తా''అన్నాను అమ్మనే చూస్తు.

ఆ మాటతో ఆమె ముఖంలో ఎంత వెలుగో! ఆ సంతోషానికి వెల కట్టేషారంతా! ఆ ఆనందాన్ని తులతూచటమా! ఆ తృప్తికి ఏది కొలమానం! నిజం... ఇది అక్షర సత్యం. ఆ క్షణంలో ఆమె ముఖంలో ఇవన్నీ నాకు కనిపించినై.

''చాల్లెండి. మీ ఛాదస్తం మీరూనూ ఆమెను అనవసరంగా ఇబ్బంది పెట్టకండి'' హెచ్చరింపుగా అన్నది నా భార్య, భారతి.

''అవున్నాన్నా .... బామ్మనేం తీసుకు వెళ్లక్కర్లేదు. మీరు వెళ్లిరండి చాలు. మొన్నామధ్యన ఆమె మనింటికి వచ్చినప్పుడు చూసిందిగా బామ్మ''పిల్లలు ముగ్గురూ ముక్త కంఠంతో తిరస్కరించారు.

అందరి వంకా కళ్లు పెద్దవి చేసి చూశాను. ఎవరి మానాన వారు మిన్నకుండి పోయారు.

ఎక్కడలేని ఓపికతో తన గుడ్డల్ని సర్దుకుంది అమ్మ. నేనూ తీసుకోవాల్సిన బట్టల్ని సర్దుకుని, అన్నింటిని ఓ సూట్‌కేసులో పెట్టాను. స్నాన పానాదులన్నీ పూర్తి చేసుకుని ప్రయాణానికి సిద్ధమయ్యాను అమ్మతో కలసి. ఆటో పిలుచుకు రమ్మని మా అబ్బాయిని పంపాను.

వాకిట్లో నీళ్ల చల్లి ముగ్గు వేసిన భారతి ఎదురొచ్చింది కానీ ఆమె ముఖం ప్రసన్నంగా లేదు. అమ్మని మెట్లు దింపి ఇంటి ముందు నిల్చున్నాను.

''పిన్నిగారూ... మీరూ వెళ్తున్నారా...జాగ్రత్త... అంత ప్రయాణం పెట్టుకున్నారు. మధ్య మధ్యలో వీలు చేసుకుని పడుకోండి. పెద్ద వాళ్లు కదా, పక్క వాళ్లు కాస్త సర్దుకుంటార్లే''ఆత్మీయంగా చెప్పింది అమ్మతో ఎదురింటి దుర్గాదేవిగారు.

ఆటో వచ్చింది. అప్పుడే వేసిన ముగ్గుని చెరిపేస్తూ గుండ్రంగా తిరిగి, వెనక్కి, ముందుకూ వూగి నిలబడంది ఆటో.

ముందుగా అమ్మని ఎక్కించాను. నేను అమ్మ పక్కనే కూర్చుని ఆమెను పొదివి పట్టుకున్నాను ఒక చేత్తో. మరో చేతికి సూట్‌కేస్ అందించాడు పుత్ర రత్నం. ఆటో కదిలింది. అందరూ చేతులూపారు.

ఉన్న కొద్ది ఖాళీ స్థలంలో పాత చాప పైన అత్తయ్య మృత దేహాన్ని పడుకోపెట్టారు. మనిషి గతంలో కంటే బాగా చిక్కిపోయింది. ఆమెను చూస్తూనే దుఃఖం ఆపుకోలేకపోయింది అమ్మ. ఒక్కసారిగా బావురుమంది. బంధువులంతా కాసేపు అనునయించాక కానీ మామూలు మనిషి కాలేకపోయింది అమ్మ. పురోహితుడు రావడం, జరిపించాల్సిన తంతు జరిపించడం, అత్తయ్య పార్థివ శరీరాన్ని మోటారు వాహనంలో శ్మశాన వాటికకు తరలించడం ఒకదాని వెంట ఒకటి చకచకా జరిగిపోయినై.

స్నానాదులు పూర్తయ్యాక, కాస్త అన్నం తిన్నాం అనిపించుకుని తిరుగు ప్రయాణం అయినాం.


''అమ్మను కూడా కష్ట పెట్టి ఇంత దూరం తీసుకువచ్చావు చాలా సంతోషం. జాగ్రత్తగా ఆమెను ఇంటికి చేర్చు''మామయ్య కొడుకు నాతో అన్నాడు.

''పాపం పెద్దావిడ... అంత దూరం నుంచి ఓపిగ్గా వచ్చింది ఒదినను చూట్టానికి... జాగ్రత్తగా ఇంటికి చేర్చండయ్యా''అక్కడి ఇరుగు పొరుగు అన్న మాటలు నా చెవిన పడ్డయ్.

అమ్మ ముఖం చూస్తే బాగా అలసటగా వున్నట్లనిపించింది. ఏమాత్రం నడిచే స్థితిలో లేదనిపించింది. అందుకే కాస్త ఆలస్యం అయినా ఆటో పిలిపించి ఆమెను ఎక్కించాలనుకున్నాను.

''అందరూ పెద్ద వాళ్లయ్యారు. వెనకటి ఓపికలు, తీరికలు లేవు. వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటూ వెళ్లిపోయినవాళ్లు అదృష్టవంతులు. పాపం మా అత్తగారు అలానే వెళ్లిపోయింది.'' అత్తయ్య కోడలు తన మనసులో మాట వినిపించింది. ఆటో వచ్చింది. ముందుగా అమ్మని ఎక్కించాను. మాతో పాటు వచ్చిన మా కజిన్, అతని భార్య, అక్కడ కలసిన మరో బంధువు వాళ్ల అబ్బాయి... ఆరుగురం అందులోనే సర్దుకోవాల్సి వచ్చింది. అమ్మకు ఇబ్బందే కూర్చోవటం. కానీ ఏమీ చేయలేని పని స్థితి. ఎవర్నీ కాదనలేని సందర్భం. ఆ ప్రాంతంలో ఆటో దొరకడానికి మళ్లీ కనీసం అరగంట పైనే పట్ట వచ్చుట.

ఫ్లాట్ ఫారం పైన జనం కిటకిటలాడుతున్నారు. రైలు రావడానికి మరో పావుగంట సమయం వుంది. ఆడవాళ్లుండబట్టి టిక్కెట్లు కాస్త తొందరగానే అందినై. అమ్మని ఓ చోట కూర్చోపెట్టి ఆమెకు తోడుగా నేనున్నాను. రైలు రాగానే బోగీలోకి ఎక్కి మా అందరికీ సీట్లు వుంచే బాధ్యత మిగిలిన మగ



వారికి అప్పచెప్పాను. ఎలాగయితేనేం అతి కష్టం మీద ఆరుగురం సీట్లలో కూర్చున్నాం. మెల్ల మెల్లగా జనం నిల్చునే వరకు పెరిగారు. మేం కూర్చున్న సీట్లోనే అమ్మను పడుకోమన్నాం. రైలు కదిలింది.

షరా మామూలే. సీట్లకోసం తగవులాటలు, తన్నుకోవటాలు, తిట్టుకోవటాలు, అంతలోనే వేదాంతం చెప్పేవారు. ఉపమానాలు, ఉదాహరణలు, అంతలో కోలాహలం. సమయం గడిచే కొద్దీ కొంత మంది నిద్రలోకి జారుకుంటున్నారు. టీ, కాఫీలు అమ్మేవాళ్లు నిర్విరామంగా వచ్చి పోతూనే వున్నారు. ఒకసారి అందరం కాఫీలు తాగాం. వేడి వేడి కాఫీ గొంతు దిగే సరికి కాస్త హాయిగా అనిపించింది.

అత్తయ్య గురించిన ముచ్చట్లతో కాసేపు, అప్పయ్య బావ ముచ్చట్లతో కాసేపు, చావు పుట్టుకల గురించీ, జన్మ జన్మల ఋణాను బంధాల గురించి, ప్రయాణాలు, పెరుగుతున్న జనాభా, రాబోయే ఎలక్షన్లు, ఆకాశాన్నంటుకున్న ధరలు, కుప్పకూలి పోతున్న షేరు మార్కెట్టు... ఒకటేమిటి రైలు గమ్య స్థానం చేరే వరకు మాకు వినిపించినవే రకు ఎన్నో.... ఎన్నో... ఎన్నెన్ని కబుర్లో మనుషుల మధ్యన. ఇంత సందడిలోనూ. అమ్మ కాసేపు కునుకు తీసినట్లే వుంది. మొత్తం మీద ప్రయాణం ముగించుకుని ఇల్లు చేరాం.

తెల్లవారుతూనే అమ్మకు జ్వరం, ఒళ్లు కాలిపోతున్నది. ఒణికి పోతున్నది. రగ్గు తీసుకు వచ్చి కప్పాను. దగ్గరే కూర్చున్నాను. తెల్లవార్లూ నిద్రలేని కారణంగా నా కళ్లూ మూతలు పడసాగినై.

మా అబ్బాయిని లేపి పాల ప్యాకెట్లు తెప్పించింది శ్రీమతి. కాఫీ తయారు చేసింది. ఇంట్లో వున్న జ్వరం మాత్ర ఒకటి అమ్మకి ఇచ్చి కాఫీ తాగించింది. నేనూ ముఖం కడుక్కుని కాఫీ కప్పు అందుకున్నాను.

''వద్దంటే వినకపోతిరి. అంత ప్రయాణం చేయ లేదు ఆవిడ అంటే కాదని తీసుకు వెళ్లారు. చూడండి... ఎంత జ్వరం వచ్చిందో''నన్ను తప్పు పట్టింది భారతి.

''మేం చెప్తే వినరు నాన్నా మీరు. మీరు చెప్పినవి మాత్రం మేం విని తీరాలి.''సందు దొరికితే సతాయించటానికి ముందుండే కుమార రత్నం గొణిగినట్టు అన్నాడు.

''జ్వరం దేముంది. రెండు రోజుల్లో తగ్గిపోతుందిలే. మాత్ర వేసుకున్నాగా మధ్యాహ్నానికి తగ్గుతుంది. కాసేపు నిద్రపోతా''అని ముసుగు పెట్టుకుని పడుకుంది అమ్మ.

ఇంట్లో శ్రీమతి, పిల్లలూ నన్ను దోషిలా చూస్తున్నారో, వాళ్లలా చూస్తున్నట్లు కనిపించిందో... రెండింటిలో ఒకటి నిజం. మర్నాడు సాయంత్రానికి అమ్మకి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. మామూలు మనిషయింది. మాతో పాటు రెండు ముద్దలు అన్న కూడా తిన్నది. కాళ్లు నెప్పులుగా వున్నయ్యంటే పిల్లలు ముగ్గురూ ఆమె కాళ్లు పిసికారు. అదేదో తైలం రాసింది మా చిన్నమ్మాయి.

ఆదివారం ఆటవిడుపుగా, రోజూ చేసే ఇడ్లీ కాకుండా, పూరీనో, చపాతీనో, మరోటో చేస్తుంటుంది ఉదయం పలహారంగా శ్రీమతి. ఈసారెందుకో పులిహోర కలిపిందట. అందరికీ ప్లేట్లలో అందించి తనూ ఓ చేత పులిహోర ప్లేటు పట్టుకుని కూర్చుందామె.

అల్పాహారం సేవిస్తూ అందర్నీ ఉద్దేశించి. ''చిన్నప్పుడు మా అమ్మ బయటకు బయల్దేరితే చాలు, వెంట పడే వాడ్ని. వద్దంటే ఏడ్చే వాడ్ని, మారాం చేసే వాడ్ని, ఒక్కోసారి బ్రతిమాలేది, ఒక్కోసారి కోప్పడేది. ఏదైనా చివరికి నన్ను తీసుకునే వెళ్లేది. కాస్త దూరం నడవంగానే, నేనిక నడవలేననుకుని చంకనెత్తుకునేది పిచ్చి అమ్మ. అంతంత దూరం రానూ, పోనూ, నన్నెత్తుకునే నడిచేది. నాకేం హాయిగా కూర్చునేవాడిని అమ్మ చంకన అలా ఎన్ని సార్లో. ఇంకొంచం వయసు వచ్చాక కూడా వద్దటే వినకుండా వెంట పడి వూళ్లకి పోయిన సందర్భాలెన్నో, బస్సు ఎక్కితే చాలు నాకు వాంతులయ్యేవి. గుడ్డలు ఖరాబయ్యేవి. నన్ను ఒడిలో పడుకోపెట్టుకుని ప్రయాణం చేసినంత సేపూ బస్సులో అసౌకర్యం అనుభవించేది అమ్మ''

''ఇప్పుడామె పెద్దదయింది. ఒంటరిగా ఎక్కడికీ వెళ్లలేదు. మనిషి సాయం కావాలి. ప్రయాణాలు చేయలేదు. నిజమే. కానీ ప్రాణానికి ప్రాణంగా మసలిన 'మన' వారినే ఆత్మీయులు దూరమైనప్పుడు కడసారిగా వాళ్లని చూడాలనుకోవటం అతి సహజం. ఆమె కోరికలో అర్థం వుంది. ఆవేదన వుంది. అర్థం చేసుకున్నాను. తీసుకువెళ్లాను''

''వద్దంటే ఆమేం చేయగలదు పాపం. మవునంగా ఇంట్లోనే వుండిపోయేది. ఇప్పుడామె రెండ్రోజులు శారీరకంగా ఇబ్బంది పడివుండచ్చు, కానీ మానసికంగా ఆమెకు లభించిన తృప్తికి ఎవరం విలువ కట్టలేం. అది అనిర్వచనీయం. అనుభవైక వేద్యం''

నేనే కాదు చాలామంది, పెద్దవాళ్లను, అంత దూర ప్రయాణం చేయలేవులే వద్దంటూ వారిస్తారు. నిజానికి అలా అనటంలో వారిపై వుండే శ్రద్ధకంటే వారిని తీసుకు వెళ్లడంలో మనం శ్రమ పడాల్సి వస్తుందనే భావన కూడా వుంటుంది. ఇది కాదనలేని నిజం. నిజమే బాల్యంలో మనం ఆ సహాయం అని తెలిసీ, మన బరువును మోస్తూ ఆనందం అనుభవించారు అమ్మా నాన్నలు. మరి పుడు మనం వాళ్ల బరువేం మోయనక్కర్లేదు వాళ్లకి సంతోషాన్నివ్వడం బాధ్యతగా భావిస్తే చాలు. ఆ సంతోషమే వారికి సగం బలం'' పులిహోరతో పాటే చెప్పటమూ పూర్తి చేశాను.

నా వాదనకు మా ఇంట్లో అందరూ అంగీకరించారు. 'పిల్లలూ, దేవుడూ చల్లని వారే కల్ల కపటమెరుగనీ కరుణామయులే' పాట మనసులో మెదిలింది నాకు.

*

## వారే నాకు ఆదర్శం...

పెద్ద పెద్ద కళ్లు, అమాయకమైన ముఖం, మంచి ఎత్తు, ఎత్తుకు తగ్గ లావుతో చూడగానే బాగుందే..అనిపించే అందం గ్రేసీసింగ్‌ది. తెలుగులో 'సంతోషం', 'తప్పు చేసి పప్పుకూడు' సినిమాలలో హీరోయిన్‌గా చేసిన గ్రేసీసింగ్ రేఖ, హేమమాలినీలే ఆదర్శమంటున్న గ్రేసీసింగ్ ఉత్తరాది భామ. హిందీలో 'లగాన్'లో అమీర్‌ఖాన్ సరసన నటించి సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. చేసిన సినిమాలు కొద్దివే అయినా తన కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గ్రేసీసింగ్‌కి బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ తారలు రేఖ, హేమమాలినీలు ఆదర్శం అంటోంది. వారు నటించిన 'కూబ్‌సూరత్', 'సీతా ఔర్ గీతా' నాచు చాలా బాగా నచ్చాయి అని చెబుతోంది.

ఆ రెండు చిత్రాలు నన్ను బాగా ఇంప్రెస్ చేశాయి. నాకు అవకాశం వస్తే.... అలాంటి చిత్రాలలో నటించి నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నాను అంటోంది. ఇప్పటికీ బాలీవుడ్‌లో నాకంటూ ఓ స్థానం ఉందనుకోండి...అంటూ గొప్పలు పోతోంది ఎర్రబుగ్గల గ్రేసీసింగ్. ప్రస్తుతం, గ్రేసీసింగ్ మాత్రం నటించిన 'దేశద్రోహి' చిత్రాన్ని ప్రమోట్ చేసే పనిలో తెగ బిజీగా ఉంటోంది. కానీ ఆ సినిమాను మహారాష్ట్రలో రెండు నెలల పాటు నిషేదించారు.

